పేదల పక్షపాతి వైఎస్ జగన్



పీబ్యాడిగెరలో ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- సంక్షేమ పథకాలతో పేదల జీవన స్థితిగతులను మార్చేశారు
- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర(అగళి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల స్థితిగతులను మార్చాయని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. వైఎస్ జగన్ పేదల పక్షపాతిగా పని చేస్తున్నారని కొనియాడారు.
టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు అందక పేదలు అనేక ఇబ్బందులకు గురయ్యారని, అయితే ప్రస్తుత ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతుండంతో పేదలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అగళి మండలంలోని పీబ్యాడిగెరలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్ జగన్ పాలనలో ఎంత మేరకు లబ్ధి చేకూరిందో లబ్ధిదారులకు వివరించారు. ప్రజల సమస్యలను కూడా తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నవరత్నాలు పేదల కుటుంబాల్లో సంతోషం నింపాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదలకు అండగా నిలబడ్డారని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా తమ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందని వెల్లడించారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలను పొందడానికి జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారన్నారు. అయితే వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కట్టుబడి పని చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ రేణుక, కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, కన్వీనర్ మహేంద్ర, ఎంపీడీఓ నరేంద్రకుమార్,ఎంపీటీసీ సురేష్, జేసీఎస్ కన్వీనర్ శివన్న,సర్పంచు నరసమ్మ, మధు, స్థానిక నాయకులు నటరాజు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

గోరంట్ల: మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సమస్యలు గుర్తించి, ప్రతిపాదనలు పంపాలన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని ఇళ్లు లేని పేదలను గుర్తించి, జాబితా సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక, మౌలిక సదుపాల కల్పనకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయడంలో సచివాలయ సిబ్బంది అలసత్వం వహించరాదన్నారు. జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్ మాట్లాడుతూ గోరంట్ల అతిపెద్ద మండలమని, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల కేంద్రంలోనే కొనసాగించాలన్నారు. గోరంట్ల మండలం కర్ణాటక సరిహద్దులో ఉందని, ఇక్కడే ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే 2023–2024 సంవత్సరానికి ప్రభుత్వం రుపొందించిన సంక్షేమ క్యాలెండర్‌ను సర్వసభ్య సమావేశంలో ఆవిష్కరించారు. జూన్ 5న జరగబోవు జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సహకార సంఘాల అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గోరంట్ల: జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగపు అధ్యక్షుడు పాటూరి శంకరరెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరయ్యారు. ఆయనతోపాటు పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

రూ.12.17 కోట్లతో 'నాడు-నేడు' పనులు



మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

అమరాపురం: మండలంలోని అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయశాఖాధికారి మంజునాథ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేయడానికి విత్తనకాయలు సిద్ధం చేసిందన్నారు. రైతులు ఆయా గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండల విద్యాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ.. మండలంలో రెండో విడత నాడు-నేడు పనుల కింద పాఠశాలల అభివృద్ధికి 36 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. మొత్తం రూ.12.17 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క మాట్లాడుతూ.. సచివాలయాల్లో అధికారులు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వెంటనే పరిష్కరించాలని కోరారు. సచివాలయాలను తనిఖీ చేసి అధికారులు సమస్యలను పరిష్కరించేలా చూస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ మునిస్వామి, ఎంఈఓ సత్యనారాయణ, ఏఓ మంజునాథ, ఏపీఓ హెన్రీ, తదితర శాఖాధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యుడు రసూల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దళితులు, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: నియోజకవర్గంలోని దళితులు, గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మడకశిరకు వచ్చిన కలెక్టర్ అరుణ్‌బాబు, పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతు, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వైబీహళ్ళి హనుమంతరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటికకు ప్రత్యేకంగా భూమి కేటాయించాలన్నారు. అదే విధంగా భూమిలేని పేదలకు భూ పంపిణీ చేయాలని కోరారు. ఒక్కో కుటుంబానికి మూడెకరాల చొప్పున పంపిణీ చేయాలని కోరారు. అంతేకాకుండా జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో అంబేడ్కర్ భవనాలను నిర్మించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

టీడీపీ నాయకుడికి సీఎంఆర్‌ఎఫ్ సాయం



రూ.లక్ష చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండలంలోని బూచెర్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ పంచాయతీ కన్వీనర్ చంద్రమౌళి తమ్ముడు ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. సీఎం సహాయనిధి కింద రూ.లక్ష మంజూరు కావడంతో మృతుడి భార్య అన్నపూర్ణకు ఎమ్మెల్యే శంకరనారాయణ చెక్కు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని పార్టీలకతీతంగా ఆదుకోవడమే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. సర్పంచ్ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలి



తూఖినకుంటలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రూరల్ వాటర్ సప్లై ఆఫీసర్ రషీద్‌ఖాన్

రొళ్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాలు అందించడానికి చర్యలు తీసువాలని శ్రీసత్యసాయి జిల్లా రూరల్ వాటర్ సప్లై ఆఫీసర్ రషీద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తూఖినకుంట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించి, చిన్నారుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. తర్వాత సెంటర్‌కు సరఫరా అవుతున్న పోషకాహారంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు. చిన్నారులు క్రమం తప్పకుండా అంగనవాడీ కేంద్రాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీర్ వెంకటేష్ పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరుడి ఊరేగింపు



స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామిని బ్రహ్మోత్సవాల్లో భాగంగా పురవీధుల్లో ఊరేగించారు. స్వామిని గజ వాహనంపై ఉంచి భజనలు చేస్తూ వీధుల్లో ఊరేగించారు. ముందుగా స్వామిని అలంకరించారు. నిత్య ఆరాధన, నిత్య హోమబలి, అభిషేకాలు, అర్చనలు దీపాలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు, వెచ్చం అమర్‌నాథ్ కుమారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల్లో అలసత్వం వద్దు



సబ్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులపై పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఆకస్మికంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. రెండో విడత నాడు-నేడులో ఈ పాఠశాలకు రూ.50 లక్షల నిధులు మంజూరైతే.. ఇంత వరకూ మరుగుదొడ్ల పనులను మాత్రమే ప్రారంభించారు. మిగిలిన పనులను ఎందుకు ప్రారంభించలేదని ఎంఈఓ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ రావును ప్రశ్నించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ సందర్శించినప్పుడు నాడు-నేడు పనులను వెంటనే ప్రారంభిస్తామని చెప్పి ఇంత వరకు పనులు ప్రారంభించకుండా ఎందుకు నిర్లక్ష్యం వహించారని నిలదీశారు. ఈ పాఠశాల మున్సిపల్ పరిధిలో ఉందని ఈ పనులను మున్సిపల్ అధికారులే పర్యవేక్షించాల్సి ఉంటుందని తెలిపారు. పనులను త్వరగా ప్రారంభించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని వార్డు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఈ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అమరాపురం: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు ప్రజలు శుక్రవారం విన్నవించారు. అమరాపురం నుంచి విరుపసముద్రం వరకూ ఉన్న రోడ్డు అధ్వాన్నంగా ఉందని, చాలా మంది గాయాల పాలవుతున్నారని ఎంపీటీసీ నారాయణ విన్నవించారు. అలాగే అమరాపురంలో మాదిగలకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని దళిత నాయకుడు నారాయణ విన్నవించారు. వెంటనే సబ్ కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిపించారు. శ్మశాన వాటికకు ఎందుకు స్థలం ఇవ్వలేదు? స్థలాన్ని పరిశీలించారా లేదా అని తహసీల్దార్ కరుణాకర్‌ను అడిగారు. స్థల పరిశీలన చేశామని తెలపడంతో పంచాయతీ వారికి అప్పగించాలని సూచించారు.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు



నాడు- నేడు పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఈఈ మురళి, ఎంపీడీఓ సరస్వతి

పరిగి: ప్రభుత్వం విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని, నాడు-నేడు పథకంతో ప్రభుత్వ బడులు, ఆస్పత్రుల రూపురేఖలు మారతాయని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఈఈ మురళి తెలిపారు. శుక్రవారం మండలంలోని సంగమేశ్వరంపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పనులను ఎంపీడీఓ సరస్వతితో కలిసి పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి రెండో దశ పనులు పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం వైఎస్సార్ పోషణ ప్లస్ పథకంతో అందిస్తున్న పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

పెనుకొండ: పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఈనెల 15లోపు ఈకేవైసీ చేయించుకోవాలని పెన్షనర్ల సంఘం మాజీ అధ్యక్షుడు శివయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంకా 40 మంది ఈకేవైసీ చేయించుకోలేదని, ట్రెజరీలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించలేదన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మరథ నిర్మాణానికి పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కొత్త బ్రహ్మరథోత్సవానికి పూజలు



శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని శ్రీనివాసమందిరం రోడ్డులోని సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలకు శుక్రవారం కొత్త బ్రహ్మ రథం నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మూల విరాట్ సప్తఫణి సుబ్రమణేశ్వరస్వామి పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ఆవరణంలో ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. కొత్త రథం నిర్మాణానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుంగలకు అర్చకులు పూజలు చేశారు. ఏటాలాగే షష్టి రోజు కొత్త బ్రహ్మరథంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కొలువుదీర్చి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకులు, నిర్వాహకులు తెలిపారు.

రైతుల కోసమే వైఎస్సార్ యంత్రసేవ



ట్రాక్టర్, రోటోవేటర్‌తో ఏఓ విజయభారతి తదితరులు

పరిగి: ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, వైఎస్సార్ యంత్రసేవ పథకం రైతాంగానికి మేలు కలిగించే పథకమని ఏఓ విజయభారతి తెలిపారు. శుక్రవారం కస్టమ్ హైరింగ్ సెంటర్ పథకంలో భాగంగా శ్రీరంగరాజుపల్లిలో ఆర్బీకే పరిధిలో ఉచిత రైతు మిత్ర గ్రూప్‌నకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రూ.3.5 లక్షల సబ్సిడీతో మంజూరైన ట్రాక్టర్, రోటోవేటర్‌ను ఏడీసీసీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రమ్యతో కలిసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లక్క, వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్, నాగరాజు, ఏఈఓ లలిత, ఆర్బీకే అసిస్టెంట్ రాధ, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

మడకశిర: నియోజకవర్గంలో కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లపై నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారం నిర్వహిస్తున్నాయి. వెంటనే అలాంటి విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్, స్థానిక నాయకులు బ్రహ్మ, సురేష్, గణేష్ తదితరులు కోరారు. శుక్రవారం ఎంఈఓ భాస్కర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

మట్కా బీటర్ అరెస్టు

సోమందేపల్లి: మండల కేంద్రంలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు బీటర్లను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1000 నగదు, మట్కా చీటీలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు జగన్ నాయక్, రంగ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: లేపాక్షి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులకు జిల్లావ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని, 15న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొని పలు అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు చలపతి, కృష్ణ, వెంకటేష్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహన ప్రమాదంలో శుక్రవారం ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. అనంతపురానికి చెందిన చంద్ర, ఓబులేష్, గోవర్ధన్ పెనుకొండలోని ఓ ఫంక్షన్‌కు వెళ్తుండగా, మార్గంమధ్యలో గుట్టూరు వద్ద ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొనింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు గుట్టూరు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

ఫలితాలు వెలువడకనే కాంగ్రెస్ సంబరాలు

పావగడ: స్థానిక విధానసభ క్షేత్రం ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే కాంగ్రెస్ నాయకులు, అభిమానులు విజయోత్సవాలు నిర్వహించు కోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలింగ్ జరిగిన రాత్రే కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్‌ను శని మహాత్మ సర్కిల్‌లో అభిమానులు ఊరేగించారు. బాణా సంచా పేల్చి సందడి చేశారు. వైఎస్ హొసకోటలో కూడా కాంగ్రెస్ అభిమానులు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపు కున్నట్లు తెలిసింది. ఈనెల 9వ తేదీ రాత్రికి రాత్రే పట్టణ జేడీఎస్ ఓటర్లు కాంగ్రెస్‌లోకి ఫిరాయించారని, పోలింగ్ రోజున వారంతా కాంగ్రెస్‌కే ఓటేశారని ప్రచారంలో ఉంది. దాదాపు పది వేల ఓట్లకు పైగా కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్ భారీ విజయం సాధిస్తాడని కాంగ్రెస్ నాయకులు బాహాటంగా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో అనేది శనివారం తెలియనుంది. తుమకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఓటరు కార్డు ప్రామాణికం కాదు

పెనుకొండ: ఇళ్ల స్థలాలకు ఓటరు కార్డు ప్రామాణికం కాదని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్వర్ణలతను కలసి సమస్య విన్నవించారు. ఓటరుకార్డు లేనివారికి కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. నాయకులు గంగాధర్, వెంకటరాముడు, కిష్టప్ప, గోవిందప్ప, షాషావలి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పరిగి: మండలంలో పరిగి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పరిగి, పైడేటి, శిరేకోళం, పి.నరసాపురం, హొన్నంపల్లి, జంగాలపల్లి, శాసనకోట, నేతులపల్లి, కాలువపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

65 మందికి కంటి పరీక్షలు

సోమందేపల్లి: మండల కేంద్రంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు వైవీఆర్ మూర్తి 65 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో ముగ్గురికి కంటి శస్త్ర చికిత్స అవసరమున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మనోహర్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర తెలిపారు.

అన్నదానం

పెనుకొండ: స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో శుక్రవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రోగులకు అన్నదానం చేశారు. ఆస్పత్రికి వచ్చిన గ్రామీణులు, రోగులు, గర్భిణులకు అన్నదానం చేసి, వాటర్ ప్యాకెట్లు అందించారు.



ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్ఠం)
హిందూపురం : 37.0
పెనుకొండ : 38.0
మడకశిర : 37.0

క్లుప్తంగా

నర్సుల సేవలు అమూల్యం



నర్సులను సన్మానించిన దృశ్యం

పావగడ: నర్సుల సేవలు వెలకట్టలేనివని స్థానిక హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సులు తేజశ్విని, సిద్ధమ్మ, భాగ్యమ్మ, సుగుణ, సరస్వతి, హనుమవ్వ, ధనలక్ష్మిని హెల్ప్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి పాలనాధికారి రామాంజనప్ప, వ్యవస్థాపకుడు అంజనప్ప, ఆరోగ్య సిబ్బంది శ్యామణ్ణ, రాజు, కృష్ణప్ప, మదన్, రాము తదితర సొసైటి పదాధికారులు పాల్గొన్నారు.

20న మండల సమావేశం

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న ఉదయం 11 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలన్నారు.

చౌక దుకాణాల తనిఖీ



ఎండీయూ వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లి, నాగళూరు గ్రామాల్లో ప్రభుత్వ చౌకధాన్య దుకాణాలను డీఎస్‌వో వంశీకృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, దుకాణాలలోని స్టాక్‌ను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గడువులోపు రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. సీఎస్‌డీటీ ప్రభావతి, రెవెన్యూ సిబ్బంది హాజరయ్యారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఏడీ అల్తాఫ్ అలీఖాన్

లేపాక్షి: ఆర్బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు అల్తాఫ్‌అలీఖాన్ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ యాంత్రీకరణ (సీహెచ్‌సీ), రైతు భరోసా, పీఎం కిసాన్, ఈ-కేవైసీ, డ్రోన్స్, విత్తన వేరుశనగ పంపిణీ, ఎరువులు, వేరుశనగ, మొక్కజొన్న, నూతన వంగడాల గురించి వివరించారు. ఆర్బీకే సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, డాక్టర్ కిషోర్, వీఏఎస్, సెరికల్చర్ ఆఫీసర్ శంకరనాయక్, ఏఈఓ పుష్పలత, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

హిందూపురం: పట్టణంలోని మార్గదర్శి పాఠశాలలో మాళప్ప, సాయికళ ఆధ్వర్యంలో సాగుతున్న వేసవిబడి విద్యార్థులకు దాతల సహకారంతో శుక్రవారం హిందూపురం ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, మమత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ వంశీకృష్ణ

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం, వెంకటరెడ్డిపల్లి, తిమ్మాపురం వార్డులలోని సమస్యల పరిష్కారానికి వెంకటరెడ్డిపల్లి సచివాలయంలో కమిషనర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మూడు వార్డులలోను నీటి గుత్తలు, ఇంటి గుత్తలు, పొజిషన్ సర్టిఫికెట్ తదితర వాటిపై దాదాపు 80 వినతులు అందినట్లు తెలిపారు.